

పిస్టల్ విక్రేతల అరెస్ట్

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పిస్టల్‌తో పాటు బుల్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 14న జ్ఞానభారతి పరిధిలో ఆయుధాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశారు. పట్టుబడిన వారు మహారాష్ట్రకు చెందిన రాహుల్‌సతీష్ మానె, మా లిక్‌గా గుర్తించారు. వీరి నుంచి రెండు పిస్టల్స్‌తో పాటు తొమ్మిది బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం పోలీసులు ప్రకటించారు. పట్టుబడిన వారి నుంచి మరింత సమాచారం కోసం విచారిస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి ఓ స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వీఐఎస్ఎల్ భవితపై నీలినీడలు



● కర్మాగారాన్ని మూసివేసేందుకు మార్చి 31 గడువు ● రోడ్డున పడనున్న 1400 మంది కార్మికులు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భద్రావతిలో గల విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారం (వీఐఎస్ఎల్) చరిత్ర పుటల్లోకి చేరిపోనుందా? ఈ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసేసేందుకు కేంద్రం గతంలో ప్రకటించిన తాత్కాలిక గడువు ఈనెల 31తో ముగియనుంది. గడువు సమీపిస్తున్న కొద్దీ ఈ కర్మాగారంలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ కర్మాగారంలో ఉత్పాదనా కార్యకలాపాలు మార్చి 31లోపు నిలిచిపోయే అవకాశాలున్నాయని పాలక మండలి గురువారం తన కర్మాగారంలోని కార్మికులకు మౌఖికంగా సూచన చేసినట్లు ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షుడు హెచ్‌జీ సురేష్ మీడియాకు చెప్పారు. ప్రస్తుతం వీఐఎస్ఎల్‌లో భారతీయ ఉక్కు ప్రాధికార (ఇండియన్ స్టీల్ అథారిటీ)కి అవసరమైన విడిపరికరాలను తయారు చేస్తున్నారు. వీటితో పాటు ప్రైమరీ మిల్, చార్‌మిల్ కూడా పనిచేస్తూనే ఉన్నాయి. వీఐఎస్ఎల్‌లో గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం ఉత్పాదన 25 శాతం మాత్రమే ఉందని పాలక మండలి వెల్లడించింది. ఈ కర్మాగారంలో ప్రైమరీ మిల్‌లో 20 రోజులకు సరిపడా, చార్‌మిల్‌లో 45 రోజులకుసరిపడా ముడిసరుకు మాత్రమే ఉన్నట్లు పాలకమండలి తెలిపింది. అయితే తర్వాత పరిస్థితి ఏమిటన్నది ఇంకా అంతుపట్టడం లేదు. ఇప్పుడైతే చారిత్రాత్మక విశ్వేశ్వరయ్య ఐరన్, స్టీల్ లిమిటెడ్‌లో త్రిశంకు పరిస్థితి నెలకొని ఉందని కార్మికులు అంటున్నారు. ప్రతియేటా జార్ఖండ్‌లోని రాంచీలో ఇండియా స్టీల్ అథారిటీ వార్షిక ప్రణాళిక సభ జరుగుతుంటుంది. అక్కడ దేశవ్యాప్తంగా ఇనుము ఉక్కు కర్మాగరాల్లోని ఉత్పాదనా పరిస్థితి, ముడిసరుకుల లభ్యత తదితర అంశాలపై సమీక్ష జరుపుతుంటారు. అయితే ఈసారి సదరు సమావేశానికి తమను ఆహ్వానించ లేదని కార్మిక సంఘం పేర్కొంది. కర్మాగారాన్ని మూసివేస్తారనడానికి ఇదే బలమైన తార్కాణంగా కనిపిస్తోందని అంటోంది. వీఐఎస్ఎల్‌ను మూసేసేయాలన్న తీర్మానాన్ని 2023 జనవరి 16న స్టీల్ అథారిటీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో తీసుకున్నారు.



వీఐఎస్ఎల్ కర్మాగారం

ఆందోళనలో 1400 మంది కార్మికులు

భద్రావతి ఇనుము ఉక్కు కర్మాగారం మూత పడితే ఇందులో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న 1400 మంది కార్మికులు వీధిపాలు కావడం ఖాయమని కార్మిక సంఘం అధ్యక్షుడు సురేష్ అంటున్నారు. ఈ కర్మాగారాన్ని మూసివేసే తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని, కార్మికుల ప్రయోజనాలను రక్షించాలని కోరుతూ భద్రావతిలో మంగళవారం రాత్రి దివిటీలతో బ్లాక్‌డ్‌ను జరిపామన్నారు. కేంద్రం తమ మొరను ఆలకిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అయితే వీఐఎస్ఎల్‌లో ప్రస్తుతం యథాస్థితి కొనసాగుతోందని, మున్ముందు ఏం జరుగుతుందో చెప్పలేమని సంస్థ నగరంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ విషయంలో వెలువడుతున్న ఊహాగానాలపై స్పందించేందుకు నిరాకరించింది. శాసనసభ ఎన్నికల సమయంలో ఈ ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితిలోనూ మూత పడబోనీయమని పలు రాజకీయ పార్టీలు హామీ ఇచ్చాయని కార్మికులు అంటున్నారు. ఇదిలా ఉండగా వీఐఎస్ఎల్‌ను మూసేయాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలతోనే రూ. 30వేల కోట్ల పెట్టుబడులతో గ్రీన్ స్టీల్‌ను ఉత్పత్తి చేయవచ్చునని సెయిల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గతంలో సిఫార్సు చేసిందని, పైగా రమణదుర్గలో 65 హెక్టార్ల ప్రదేశంలోని గనులు, సండూరులోని 130 ఎకరాల గనులను సద్వినియోగం చేసుకుంటే ముడిసరకుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వీఐఎస్ఎల్‌ను కాపాడుకోవచ్చునని కార్మికులు అంటున్నారు. మొత్తానికి విఐఎస్ఎల్‌పై నీలినీడలు కమ్ముకుని ఉన్నాయి.

కార్మికులకు సీఎం శుభవార్త

● రోజుకు 12 గంటల పని తప్పనిసరి కాదు ● 8 గంటల పాటు చేస్తేచాలు


సమావేశంలో పాల్గొన్న వివిధ పోరాట సంస్థల ప్రతినిధులు, ప్రసంగిస్తున్న సీఎం సిద్ధరామయ్య, డీసీఎం శివకుమార్

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మికుల పని గంటలను 12 గంటలకు పెంచుతూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. బెంగళూరులోని తన అధికార నివాసం కృష్ణలో గురువారం ఆయన రైతులు, దళితులు, కార్మికులు, విద్యార్థులు, మహిళా సంఘాలతో కూడిన సంయుక్త పోరాటవేదిక పదాధికారులు, ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. రైతులు, కార్మికుల సమస్యలను చట్టప్రకారం పరిశీలించి పరిష్కార మార్గాలను వెతుకుతామన్నారు. కర్మాగారాల చట్టం (సవరణ బిల్లు) 2023 ప్రకారం రోజుకు 12 గంటల పాటు పనిచేయడం తప్పనిసరి కాదన్నారు. దీన్ని ఉపసంహరించుకుంటామని, గతంలో మాదిరిగానే రోజుకు 8గంటలపాటు పనిచేసేలా చట్టానికి సవరణలు తెస్తామని సీఎం ప్రకటించారు. భూస్వాధీన చట్టాల అమలు, గోవధ నిషేధ చట్టం తర్వాత రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, బగర్‌హుకుం, గ్రామీణ బ్యాంకుల్లో రైతుల రుణాలకు ఓటిఎస్ సదుపాయం, బెంగళూరు ఫ్రీడం పార్కును ఇకపై పూర్తిగా పోరాటాలు, ప్రదర్శనలకే పరిమితం చేయడం వంటి అంశాలపై దాదాపు రెండు గంటలకు పైగా సుదీర్ఘ చర్చ జరిగిందని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు.

సాంస్కృతిక రాయబారిగా బసవణ్ణ



● ఫిబ్రవరి 16న రాష్ట్ర బడ్జెట్ ● కేబినెట్ భేటీలో పలు కీలక తీర్మానాలు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణం కోసం 12వ శతాబ్దంలోనే పాటుపడిన బసవణ్ణను రాష్ట్ర సాంస్కృతిక రాయబారిగా తీర్మానిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన కేబినెట్ సమావేశం నిర్వహించారు. లింగాయత సమాజానికి చెందిన పలువురు స్వామీజీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మంత్రివర్గం ఈ మేరకు తీర్మానించినట్లు శాసనసభా వ్యవహారాల శాఖ మం త్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. అంతర్గత రిజర్వేషన్ల వర్గీకరణ అంశాన్ని కేంద్రానికి సిఫారసు చేశామన్నారు. ఫిబ్రవరి 12 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. తొలిరోజున గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడతారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను 16న ఆర్థికశాఖ మంత్రి హోదాలో సీఎం సిద్ధరామయ్య ప్రవేశపెడతారన్నారు. 23వ తేదీ వర కూ శాసనసభ సమావేశాలు జరుగుతాయన్నారు. చిక్కమగళూరు బా బాబుడేన్ గిరి వివాదంపై సుప్రీం కోర్టులో అభ్యంతరాలను వ్యక్తం చేసేలా సబ్‌కమిటీని నియమించామన్నారు. గృహజ్యోతి ద్వారా 48 యూనిట్ల కంటే తక్కువ వినియోగదారులకు అదనంగా పది యూనిట్లు పెంచుతూ తీర్మానించామన్నారు. శివమొగ్గ ఫ్రీడం పార్కు మైదానానికి అల్లమప్రభు పేరుకు అంగీకరించామన్నారు. బెళగావి కిత్తూరు తాలూకా పేరును చెన్నమ్మ కిత్తూరుగా మార్చామన్నారు. వీటితో పాటు ప్రాంతాల వారిగా అభివృద్ధి పనులకు కేబినెట్‌లో నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

అల్బని యూనివర్సిటీతో రామయ్య అప్లయ్డ్ సైన్స్ యూనివర్సిటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రముఖులు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లయ్డ్ సైన్స్, స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ (అల్బని)తో నగరంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రామయ్య అప్లయ్డ్ సైన్స్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం కుదుర్చుకునేందుకు అల్బనీ యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ హ్యావిడన్ రోడ్రిగస్ సారథ్యంలో ఆరుగురు సభ్యుల ఉన్నత స్థాయి బృందం బెంగళూరు నగరానికి విచ్చేసింది. ఈ సందర్భంగా రామయ్య అప్లయ్డ్ సైన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ ఎంఆర్ జయరాం మాట్లాడుతూ అల్బని విశ్వవిద్యాలయంతో కుదర్చుకున్న ఈ ఒప్పందం ఉన్నత విద్యారంగంలో ఒక మైలురాయికానుందని, అంతర్జాతీయ స్థాయిలో పరస్పర సహకారానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రత్యేకించి విద్యార్థులు పరస్పరం ఉభయ దేశాల్లో పర్యటించి పరిశోధనలు చేస్తారని, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న సాంకేతిక పరిణామాల మార్పులపై అవగాహనపెంచుకుంటారని, ఇది వారి విద్యావికాసానికి బాగా ఉపయోగపడుతుందని జయరాం పేర్కొన్నారు. ఉభయ యూనివర్సిటీల మధ్య ఈ ఒప్పందం ఒక బలమైన వారధిని నిర్మించడంతో పాటు సంబంధాలను బలోపేతం చేయనుందని అల్బని విశ్వవిద్యాలయం ఛైర్మన్ హ్యావిడన్ రోడ్రిగస్ పేర్కొన్నారు. రామయ్య అప్లయ్డ్ సైన్స్ వర్సిటీకి చెందిన పలువురు ప్రముఖులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

● 36 మంది ఎమ్మెల్యేలు, 39 మంది నాయకులకు పదవులు: ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్


బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులకు బోర్డులు, కార్పొరేషన్ హోదాలు కల్పించేందుకు పూర్తి ప్రక్రియ ముగిసింది. ఇదే విషయమై గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ 36 మంది ఎమ్మెల్యేలు, 39 మంది సీనియర్ కార్యకర్తలకు బోర్డులు, కార్పొరేషన్ ఛైర్మన్ హోదాలు కల్పిస్తున్నామని ప్రకటించారు. ఏ క్షణంలోనైనా జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు పనిచేశారని, వారికి అధికారం కల్పిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం కేపీసీసీలోని ఇందిరాభవన్‌లో జరుగుతుందన్నారు. మధ్యాహ్నం సమావేశం నిర్వహించాలని భావించామని, కానీ నగరానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తుండడంతో సాయంత్రానికి వాయిదా వేశామన్నారు. తొలి సమావేశంలోనే అన్ని తీర్మానాలు ఉండవన్నారు. జగదీష్‌శెట్టర్, లక్ష్మణసవదిలను ఆహ్వానించామన్నారు. గత ఎన్నికల కమిటీలో ఉండేవారంతా యథావిధిగా కొనసాగుతున్నారని అన్నారు. సిద్ధరామయ్యలో రాముడు ఉన్నారని, తన పేరులో శివుడు ఉన్నారని మతం మన వ్యక్తిగతమని అన్నారు. రామమందిర విషయంలో కాంగ్రెస్‌కు ఎటువంటి నష్టం లేదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.




ఎన్టీఆర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు


బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావుకు యలహంకలోని ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రాత్రి చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. దేవాంగం పాపన్న మాట్లాడుతూ ఎన్‌టీఆర్ యుగపురుషుడన్నారు. టీడీపీ ద్వారా ఏపీని ఎంతో అభివృద్ధి చేశారని, అన్ని వర్గాలకు రాజకీయ భవిష్యత్తు కల్పించారని తెలిపారు. ఎన్‌టీఆర్ అ మర్ రహే అంటూ అభిమానులు నినాదాలు చేశారు. ఎన్టీఆర్ అభిమానులు చెన్నకేశవులు, రెడ్డప్పరెడ్డి, వెంకటరామిరె డ్డి, హోటల్ రమణ, ఓడీసీ బాబు, శ్రీరాములు, వేమారెడ్డి, నాగిరెడ్డి, కదిరి అశోక్ పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.91	1,620.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,637
సామర్థ్యం (టీఎంసీలు)	10.14	61.86

నేడు యోగి వేమన జయంతి



బళ్లారి సిటీ, జనవరి 18: మహాయోగి వేమన 612వ జయంతిని పురస్కరించుకుని బళ్లారిలోని రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నారాప్రతాప్ రెడ్డి, గౌరవాధ్యక్షులు జి.సోమశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కర్ణాటక ప్రభుత్వం మహాయోగివేమన జయంతిని శుక్రవారం జరుపుతున్నట్లు తెలిపారు. బళ్లారి నగరంలో కర్ణాటక ప్రభుత్వం, రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో జయంతి నిర్వహిస్తామన్నారు. అనంతపురం రోడ్డులోని బీడీఏఏ మైదానంలో ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్రానికి సంబంధించిన పలువురు మం త్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పుర ప్రముఖులు పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగాఉన్న రెడ్డి బాంధవులు, రెడ్డి ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, మహాసాధ్వి హేమ రెడ్డి మల్లమ్మ మహిళా సంఘం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆలయాల పరిశుభ్రత చేపట్టిన బీజేపీ



దేవాలయప్రాంగణాన్ని శుభ్రంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే

సిరుగుప్ప, జనవరి 18 : ఈ నెల 22న అయోధ్యలో రాముని ప్రతిష్ట సందర్భంగా పట్టణ ఆలయాల్లో గురువారం బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప నేతృత్వంలో పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని వివిధ ఆలయ ప్రాంగణాలను నీటితో కడిగారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు విశ్వనాథ, వీరేష, మహదేవ, నటరాజ, రామకృష్ణ, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు షిర్డీ సాయి ట్రస్ట్ వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

బళ్లారి సిటీ, జనవరి 18: శ్రీ షిరిడి సాయి సత్సంగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8గంటలకు నగరంలోని బలిజ భవన్‌లో కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ట్రస్ట్‌హాల్లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వైశ్యవిద్యానిధి ప్రధాన కార్యదర్శి పత్తి గోపాలకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఉదయం 9గంటల నుండి డాక్టర్ విజయ్ కంటి పరీక్షలు నిర్వహిస్తారని, జనవరి 19న సత్సంగ్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత సామూహిక సాయిసత్యవ్రతాన్ని నిర్వహిస్తారన్నారు. ఉదయం అభిషేకం, 10గంటలకు వ్రతం, హారతి, ప్రసాద పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ట్రస్టు ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రమేశ్,సంయుక్తకార్యదర్శి కొండయ్య, కోశాధికారి కే.గోవిందరాజులు, సలహాదారులు కిశోర్‌కుమార్, సొంతగిరధర్ తదితరులు పాల్గొన్నారు.

ముల్లంగి ధరల పెరుగుదల

హోసూరు (మత్తిగిరి) జనవరి 18 : ముల్లంగి ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. హోసూరు పరిసర ప్రాంతాలలో తళి, డెంకణీకోట, అంచెట్టి, కెలమంగలం, రాయకోట, శూలగిరి, ఉన్నట్టి, సామనపల్లి, కీరనపల్లి, త్యాగరసనపల్లి, బాగలూరు తదితర ప్రాంతాలలో రైతులు ముల్లంగి సాగు చేస్తున్నారు. ఇక్కడ పండే ముల్లంగిని ట్రక్కుల ద్వారా రాయకోట, కృష్ణగిరి ,సేలం, బెంగళూరు, హోసూరు, కోయంబత్తూరు, ఈరోడ్డు, మదురై ప్రాంతాలకు పంపుతారు. ఈ ప్రాంతాల నుంచి రోజుకు దాదాపు 100టన్నుల ముల్లంగి ఉత్పత్తి అవుతోంది. ముల్లంగి 45 రోజుల కంటే ఎక్కువ ఆలస్యం చేస్తే పంట పాడైపోతుంది. ప్రస్తుతం కిలో రూ. 40 నుంచి రూ.50వరకు పలుకుతోంది. దీంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక యుగపురుషుడు ఎన్టీఆర్

● కమ్మసంఘం నేతల నివాళి



బళ్లారిలోని కమ్మభవనం వద్ద ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న కమ్మసంఘం నాయకులు

బళ్లారి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు ఆధునిక యుగపురుషుడని, ఆయన నేటికీ జనం గుండెల్లో జీవించే యున్నారని కమ్మసంఘం నాయకులు పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా గురువారం బళ్లారిలోని కమ్మ భవనం వద్ద ప్రతిష్ఠించిన ఎన్టీఆర్ విగ్రహానికి వారు పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వర్ధంతి కార్యక్రమంలో బళ్లారి కమ్మసంఘం జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాల వేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీ. అమరేంద్ర చౌదరి, ఎం. చంద్రశేఖర్ చౌదరి, లాల్ మోహన్, కుడితిని శ్రీనివాసులు, వెంకటనాయుడు తదితరులు ప్రసంగించారు. నందమూరి తారక రామారావు చిత్రరంగంలో అనేక దేవతా పాత్రల్లో నటించారని, ఆయన వేసిన ప్రతి పాత్ర నభూతో నభవిష్యత్ లాంటి వన్నారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీని ప్రారంభించి అతి తక్కువ కాలంలోనే పేద ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పేదప్రజలకు మేలు చేయడానికి ప్రారంభించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు జి.రమేశ్, క్రిష్ణమనాయుడు, టి.సురేష్, అభిలాష్ శీనా, కె. ఉమేష్, జె.నాగరాజు, ఎం.వెంకటనారాయణ, కె.కోటేశ్వరరావు, ఎన్‌కే సురేష్, మాధవి లత, బోయపాటి విష్ణు, తదితర కమ్మసంఘం నాయకులు, పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు భారీ ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జనవరి 18: ఎలాంటి లోపం లేకుండా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇం దుకు ఏర్పాట్లు భారీగా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లాకలెక్టర్ కార్యాలయ హాల్లో ఏర్పాటుచేసిన గణతంత్ర వేడుకల సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత



గణతంత్ర వేడుకల సన్నాహ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వహించి మాట్లాడారు. జనవరి 26 వ తేదీ ఉదయం 9గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జాతీయజెండాను ఎగురవేస్తారన్నారు. అంతకంటే ముం దు ఉదయం 8గంటలకు నగరంలోని గవియప్ప సర్కిల్లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి తదుపరి విమ్స్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం జరిగే ఊరేగింపులో పోలీస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పాటు పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని, పోలీస్ శాఖ కూడా శోభాయాత్రకు సిద్ధం కావాలన్నారు. విమ్స్‌స్టేడియంలో కార్యక్రమం నిర్వహిస్తున్నందున, ప్లాట్‌ఫారమ్, సీటింగ్ తదితర ఏర్పాట్లను పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ పూర్తిచేయాలన్నారు. పాఠశాల, కళాశాల పిల్లలకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. పాఠశాల విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా ఆకర్షణీయమైన సాంస్కృతిక కార్యక్రమాన్ని చక్కగా ఏర్పాటు చేయాలని, అవసరమైన శిక్షణను ముందస్తుగా చేపట్టాలని ప్రభుత్వ విద్యాశాఖ ఉప సంచాలకులకు సూచించారు. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో వివిధ కూడళ్లలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెస్కామ్ ఇంజినీర్‌ను కోరారు. సమావేశంలో జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్‌శరణప్ప సంకనూర్, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జేబేరా, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్, జిల్లాఎస్పీ రంజిత్‌కమార్‌బండార్, జిల్లాస్థాయిలోని వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

26నుంచి రాజ్యాంగ అవగాహనపై జాతా

భారత రాజ్యాంగం, దాని విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి 26 నుంచి జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమం కింద జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలోని భావనలపై అవగాహన కల్పించారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సతీశ్ మాట్లాడుతూ జనవరి 26న రాజ్యాంగ జాతా కార్యక్రమాన్ని జిల్లాఇన్‌ఛార్జిమంత్రి నాగేంద్ర ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల మీదుగా జాతా సాగునుందని, ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలోకి వాహనం రాగానే ప్రజాప్రతినిధులు శోభయాత్రకు స్వాగతం పలుకుతారన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భారత రాజ్యాంగంపై సంక్షిప్త సమాచార పుస్తకాన్ని ముద్రించి, ప్రతులను ఊరేగింపు సందర్భంగా ప్రజలకు పంచాలని సమావేశంలో సూచించారు.

న్యాయం లభించేంతవరకు నిరసన: రైతులు



కుడితినిలో భూములు పోగొట్టుకుని నిరసనలో పాల్గొన్న రైతన్నలు

కంప్లి, జనవరి 18 : కర్మాగారాల వలన భూములు పోగొట్టుకున్న తమకు న్యాయంలభించేంతవరకు పోరాటం చేయక తప్పదని కుడితిని పరిధిలోని హరిగిణదోణి, జానెకుంటి, కొళగల్, వేణి వీరాపురం, సిద్దమ్మనహళ్లి, కుడితిని గ్రామాల రైతులు పేర్కొన్నారు. సుమారు 396రోజుల పాటు న్యాయ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రైతు సంఘం హసిరుసేన, సీఐటీయు, కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నామని, ఇప్పటికీ రైతులకు న్యాయం జరుగలేదని వివిధ సంఘ సంస్థ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు సమావేశాలు జరుపలేదన్నారు. కేవలం మాటలకే పరిమితమయ్యారని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండావానా గాలి వర్షం ఎన్ని వచ్చినా తమకు న్యాయం లభించే వరకు ఈ పోరాటం చేస్తామని రైతులు తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

కంప్లి, జనవరి 18 : రానున్న వేసవిని దృష్టిలో వుంచుకుని తాగునీటి సమస్య రాకుండా చూడాలని విజయనగర, బళ్లారి జిల్లాల నోడల్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. కంప్లి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం కేడీపీ సమావేశం ఏర్పాటు చేశారు. అందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరాజ్ శివపుర మాట్లాడుతూ జిల్లాలోని ఐదు తాలుకాలను కరువు తాలుకాలుగా ప్రకటించారన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు సర్వే నిర్వహించారని, నష్టపోయిన రైతుల ఆధార్ కార్డు, ఎఫ్ ఐడీ సంఖ్య, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం అధికారులకు అందించినట్లయితే నేరుగా నష్టపరిహారం ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో మరో ప్రగతి పరిశీలన సభ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో బస్సు సౌకర్యం లేకపోవడంవలన ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారన్నారని, కేఎస్ఆర్టీసీ అధికారులు కూడా ఆ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా ఈవో శ్రీకుమార్, పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్న గౌడ, మున్సిపాల్టీ ముఖ్య అధికారి దర్గన్న, రెవెన్యూ అధికారి జగదీష్, వెటర్నీరీ వైద్యులు బసవరాజు, శ్రీధర్, విరుపాక్షి, డీటీ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత నైపుణ్యాలతో విద్యాబోధన



సమావేశంలో మాట్లాడుతున్న కిష్కంధ వర్సిటీ వీసీ నాగభూషణ్

బళ్లారి సిటీ, జనవరి 18: ఆధునిక సాధనాలను ఉపయోగించి ఉన్నతవిద్యను అందించడానికి కిష్కింధ విశ్వవిద్యాలయం పనిచేస్తుందని వీసీ నాగభూషణ్ తెలిపారు. నగరంలోని కిష్కింధ విద్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎంబీఏ, ఎంసీఏ, పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులు వచ్చే నెలనుంచి ప్రారంభం కానుండగా ఇందుకోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. తాము ఉన్నత స్థాయి నైపుణ్యాలతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. కురుగోడు తాలూకా సిందగేరి దగ్గర నూతనంగా 50ఎకరాల స్థలంలో కిష్కింధ విశ్వవిద్యాలయం పనులు జరుగుతున్నాయని తెలిపారు. గత ఏడాది అనుమతి రావడంతో అడ్మిషన్లు ఆలస్యమైనాయన్నారు. 540 సీట్లకుగాను 203సీట్లు భర్తీ అయ్యాయని, ఈసంవత్సరం పూర్తిగా సీట్లు భర్తీ అవుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను చేర్చుకోవడంలో మరింత నిమగ్నమయ్యేలా యూనివర్సిటీ కృషి చేస్తున్నదన్నారు. తమ విశ్వవిద్యాలయంలో ఎన్ఈపీ తరహా విద్యకు అవసరమైన లెక్చరర్లు ఉంటారని ఇందులో కొత్త కోర్సులు ప్రారంభించే ఆలోచన ఉందన్నారు. పరిశ్రమ ఆధారిత బోధనా విద్యకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ఎస్.బి.కామశెట్టి, బిఐటీఎం డాక్టర్ వీరన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ఫారం-3 ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యంపై చర్చిస్తున్న లోకాయుక్త

సిరుగుప్ప, జనవరి 18 : అధికారులు ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు తెలిపారు. సిరుగుప్ప పట్టణ శిశు అభివృద్ధి యోజన కార్యాలయ భవనంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కారంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా నగరసభకు సంబంధించి ఫారమ్ నెంబర్ 3 ధ్రువీకరణపత్రాలను చట్టపరంగా అందజేయాలని సూచించారు. ఆర్టీసీ బస్సులను విద్యార్థులకు అనుకూలమయ్యేటట్లు చూడాలని అధికారులకు సూచించారు. రోగులకు చికిత్స అందించడంలో వైద్యుల నిర్లక్ష్యం తగదన్నారు. వివిధ శాఖల సమస్యలపై చర్చించారు. సమయానికి సక్రమంగా విధులకు హాజరుకావాలని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా లోకాయుక్త సీఐ సంగమేష, తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ, సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి, గ్రామీణ తాగునీరు సరఫరా ఏఈఈ రవీంద్రనాయక్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయండి



బుక్కసాగర వద్ద నది ఒడ్డున కనిపించిన మొసలి

కంప్లి, జనవరి 18 : తుంగభద్ర నదిలో మొసళ్లు సంచరించే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని బుక్కసాగర రైతన్నలు కోరుతున్నారు. బుక్కసాగర నుంచి కడేబాగిలుకు వెళ్లే వంతెన భాగంలో నదిలో మొసళ్లు ఎక్కువగా వుండటంతో రైతులు పొలాలకు వెళ్లాలన్నా, పశువులు నదిలో నీరు తాగేందుకు వెళ్లాలన్నా భయపడుతున్నారన్నారు. మొసళ్లు సంచరించే ప్రదేశంలో ప్రమాదసూచికలు ఏర్పాటు చేసినట్లయితే రైతులు జాగ్రత్తపడతారన్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లే సమయంలో నదిఒడ్డున మొసళ్లు దాడి చేసే అవకాశం వుందన్నారు. కావున అటవీశాఖ అధికారులు నది ఒడ్డున హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి మరోసారి ప్రమాదం జరుగకుండా చూడాలని కోరారు.

కొత్త పారిశ్రామిక వాడల్లో పనుల పూర్తికి ఆదేశం



అధికారులతో సమావేశమైన డీసీ చంద్రశేఖర్ నాయక్

రాయచూరు జనవరి 18 : జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయే పారిశ్రామిక వాడలను అన్ని విధాల సిద్ధం చేసి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. వివిధ శాఖల అధికారులతో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు సంబంధించి గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తగా గుర్తించిన పారిశ్రామిక వాడల ప్రదేశాల్లో పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. లోకసభ ఎన్నికలషెడ్యూల్ వెలువడక ముందే పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.

హోసూరు జోన్

శానమావు ప్రాంతంలో 15 ఏనుగుల మకాం



అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

హోసూరు జనవరి 18 : డెంకణీకోట అటవీ ప్రాంతానికి చెందిన 13 ఏనుగులు గత కొన్ని రోజులుగా ఊడేదుర్గం అటవీ ప్రాంతానికి వెళ్లి రాత్రి పూట సమీపంలోని పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీ ఏనుగులు అనుమంతపురం, సినిగిరిపల్లి , బెన్నికల్ మీదుగా ఊడేదుర్గం అటవీప్రాంతాన్ని వదిలి ఇప్పుడు హోసూరు సానమావు అటవీ ప్రాంతానికి వచ్చి మకాం చేశాయి. హోసూరు సానమావు అడవుల్లో ఇప్పటికే రెండు ఏనుగులు ఉండగా, ఇప్పుడు మరో 13 ఏనుగులు రావడంతో మొత్తం అడవీ ఏనుగుల సంఖ్య 15 కు చేరింది, అయిన్నప్పటికీ రాత్రి వేళ్లలో ఏనుగులు వ్యవసాయ పంటలు ధ్వంసం చేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. చుట్టు ప్రక్కల ఉన్న శానమావు, బీర్జేపల్లి, అళియాళం, పోడూరు, సహా పది గ్రామాలవారు రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని, అటవీప్రాంత అధికారులు హెచ్చరించారు. ఒంటరిగా రాత్రి పూట బయటికి వెళ్లకూడదని, ఒంటరిగా ఉన్న ఏనుగులను చూసిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

హోసూరు ప్రభుత్వ ఆసుపత్రి పనులకు శంకుస్థాపన

హోసూరు(కృష్ణగిరి) జనవరి 18 : హోసూరు ఆసుపత్రిని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిగా మారుస్తూ అందుకు తగినట్లుగా గురువారం నిర్మాణ పనులను ప్రారంభించారు. కృష్ణగిరిజిల్లా హోసూరు ప్రజలకోసం వైద్య సేవలు అందించేందుకు 419పడకల ప్రీమియర్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. అనంతరం ఆహార సరఫరా మంత్రి ఆర్.చక్రపాణి, జిల్లా కలెక్టర్ సరయు, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఏ.చెల్లకుమార్, హోసూరు అసెంబ్లీ సభ్యుడు వై.ప్రకాశ్, హోసూరు కార్పొరేషన్ మేయర్ ఎస్.ఏ.సత్య సమక్షంలో హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించారు. తమిళనాడు ముఖ్యమంత్రి పేద, మధ్యతరగతి ప్రజలకు సులభంగా వైద్యం అందించేందుకు వైద్యరంగంలో పలు పథకాలను ప్రకటించి అమలు చేస్తున్నారు. దీని ప్రకారం ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ తరఫున, హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిని రూ.100 కోట్లతో 22,395 చదరపు మీటర్ల (2,41,000)చదరపు అడుగులు) విస్తీర్ణంల్లో నిర్మించడానికి నిర్ణయించారు.

ఘనంగా సద్గురు నారాయణతాత ఆరాధన

హోసూరు జనవరి 18 :సద్గురు నారాయణతాత ఆరాధన మహోత్సవం గుడిసాకనపల్లి ఆశ్రమంలో గురువారం వైభవంగా జరిగింది. శ్రీ ఆత్మానంద స్వాముల పుత్రుడు మునిరామయ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వామి వారు అధ్యక్షత వహించారు. ఉదయం ఆశ్రమంలో ఉన్న దేవతా మూర్తులకు అభిషేక కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాద పూజ చేసి ఆయన ఆశీర్వాదం పొందారు. ఆ తర్వాత స్వామివారు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోను ఇలాంటి మహోత్సవాలు జరుపడం వల్ల ఆ ప్రాంతంల్లో శాంతి నెలకొంటుందని, ప్రశాంతతతో జీవితం గడిపే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కువ సంఖ్యల్లో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని, గురువులు చెప్పిన మాటలను విని జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వామిని గ్రామస్తులు పూజలు చేసి సత్కరించారు.



స్వామివారిని సత్కరిస్తున్న భక్తులు

విజ్ఞాన కేంద్రాలు సమర్థవంతంగా పని చేయాలి



విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి భోసరాజు

రాయచూరు జనవరి 18 :జిల్లాలోని విజ్ఞాన కేంద్రాలు మరింత సమర్థవంతంగా పనిచేసి విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా తోడ్పడాలని రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజి శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని విజ్ఞాన కేంద్రాన్ని గురువారం పరిశీలించిన మంత్రి భోసరాజు, అక్కడి ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ఆయన విజ్ఞాన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఉపకరణాలు, వాటి వల్ల జరుగుతున్న ప్రయోగాలు విద్యార్థులకు అందుతున్న బోధన తదితరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విజ్ఞాన కేంద్రాల్లో జరుగుతున్న పురోగతి పనులను సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. కేంద్రాల అభివృద్ధికి ఉపకరణాలకు సంబంధించి సమగ్ర నివేదికను అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాగా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యవరకు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విజ్ఞాన శాస్త్రం బోధన సాగినప్పుడే వారికి విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి కలుగుతుందని మంత్రి వ్యాఖ్యానించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



రైతు శివపుత్రప్ప(ఫైల్)

రాయచూరు జనవరి 18 : జిల్లాలోని మస్కి తాలూకా వీరాపుర గ్రామానికి చెందిన రైతు శివపుత్రప్ప(45) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తుర్విహాళ్ యూకో బ్యాంక్, బోగాపుర వ్యవసాయ సహకార సంఘంతో పాటు ప్రైవేటుగా చేసిన రూ.6లక్షల అప్పులను తీర్చలేక పోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఏడాది వర్షభావ పరిస్థితులవల్ల పంటలు అంతంత మాత్రంగానే ఉండడంతో దిగులుచెందిన ఆయన బుధవారం రాత్రి తన ఇంట్లోనే పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు గంగావతి ఆస్పత్రికి తరలించగా చికిత్స విఫలమై మృత్యువాతపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

శిర్కాజి గోవిందరాజన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత శిర్కాజి గోవిందరాజన్ 1933 జనవరి 19న మద్రాస్‌లోని శిర్కాలి ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో గాయకుడిగా పేరొందారు. దక్షిణాదిన సినీ నేపథ్యగాయకుడిగా రాణించారు. ఇసైమణి, సంగీత విద్వాన్ తదితర బిరుదులు పొందారు. గురువు తరుపంపురం స్వామినాథ పిళ్ళై వద్ద సంగీతం నేర్చుకున్నారు. రాగం, తాళం, పల్లవిలో తన ప్రతిభను చాటారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం సినిమాలలో వర్ధమాన హీరోలకు పాటలుపాడారు. భక్తి పాటలు సైతం ఆలపించడంలో ప్రసిద్ధులు. 1988లో కన్నుమూశారు.

ఎడ్గర్ అల్లన్ పో (జయంతి)



ఎడ్గర్ అల్లన్ పో 1809 జనవరి 19న జన్మించారు. అమెరికా దేశానికి చెందిన రచయిత, కవి, ఎడిటర్, సాహితీ విమర్శకులు, యూరప్‌లోనే పేరొందారు. పద్యాలు, చిన్నకథలు రాయడం ప్రత్యేకత. డిటెక్టివ్ ఫిక్షన్, సైన్స్ ఫిక్షన్‌కు సంబంధించి కూడా కథలు రాశారు. ఆయన గౌరవార్థం 'మిస్టరీ రైటర్స్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో ఏటా ఎడ్గర్ అవార్డును అందిస్తున్నారు. ఆయన 1849 అక్టోబరు 7న కన్నుమూశారు.

డాలీ పార్టన్ (పుట్టినరోజు)



డాలీ రెబెకా పార్టన్ 1946 జనవరి 19న జన్మించారు. అమెరికాకు చెందిన గాయని, గేయ రచయిత, మల్టి ఇన్‌స్ట్రుమెంటలిస్ట్, నటి, రచయిత, వ్యాపార మహిళా నేతగా రాణించారు. 10 గ్రామీ అవార్డులు, జీవితసాఫల్య పురస్కారం అందుకున్నారు. 'కంట్రీ మ్యూజిక్ హాల్ ఆఫ్ ఫేం' లో తనదైన గుర్తింపు పొందారు.

లాల్‌బాగ్ ఫలపుష్ప ప్రదర్శనను ప్రారంభించిన సీఎం





బెంగళూరు లాల్‌బాగ్‌లో ఫలపుష్ప ప్రదర్శనను ప్రారంభించి తిలకిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బెంగళూరు లాల్‌బాగ్‌లో తోటల అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫలపుష్ప ప్రదర్శనను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈసారి లాల్‌బాగ్ గ్లాస్‌హౌస్‌లో విశ్వగురు బసవణ్ణ, ఆయన వచన సాహిత్య అంశాలను ప్రధానంగా తీసుకుని లక్షలాది పూలతో ప్రదర్శనను తీర్చిదిద్దారు. బసవణ్ణ వచనాలు సమసమాజ నిర్మాణానికి ఎంతో ప్రస్తుతమని సీఎం పేర్కొన్నారు. సమాజంలో సామరస్యం కోసం బసవణ్ణ తన వచనాలతో ప్రజలను ప్రభావితపరిచారన్నా రు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, అధికారులు హాజరయ్యారు. ఈ ప్రదర్శన జనవరి 27 వరకు కొనసాగనుంది.

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు
సగం రోజు సెలవు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో ఈ నెల 22న రామలల్లా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సగం రోజు సెలవు ప్రకటించారు. ఆ రోజు మధ్యాహ్నం 2-30 గంటల వరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెలవు తీసుకునే వెసులు బాటు కల్పించారు. కాగా కేంద్ర ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నెల 22న సెలవు ప్రకటించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బివై.విజయేంద్ర సూచించారు. ఈ మేరకు నగరంలో గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఈనెల 22న సెలవు రోజుగా ప్రకటించాయని దేశ ప్రజలంతూ అత్యంత ఉత్కంఠతతో రామమందిర ప్రారంభ శుభ ఘడియల కోసం ఎదురు చూస్తున్నారని రామమందిర వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్ళేందుకు ఆసక్తిలేకపోయినా కనీసం ప్రజలైనా టీవీలలో వీక్షించేందుకు వీలుగా సెలవు ప్రకటించాలని ఆయన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

బీజేపీ అగ్రనేతల తీరుపై
మాదిగల్లో తీవ్ర అసంతృప్తి

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో మాదిగ కులస్థులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న అసంతృప్తి నగరంలో బుధవారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో వ్యక్తమైంది. మాజీ మంత్రి కోటె శివణ్ణ, రాజ్యసభ మాజీ సభ్యుడు కృష్ణమూర్తి, రాష్ట్ర సంచార జాతుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు దేవేంద్రనాథ్ తదితరులు ఈ కీలక సమావేశానికి హాజరయ్యారు. బెళగావి, చిత్రదుర్గ, కల్బుర్గి, బీదర్, మైసూరు తదితర జిల్లాల నుంచి బీజేపీ కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గోవిందకార్జోళ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో మాదిగ కులస్థులకు అనేక కమిటీల్లో చోటు లభించిందని ఇప్పుడు బీజేపీ ఎస్‌సీ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడైన చలవాది నారాయణస్వామి తమను పట్టించుకోవడంలేదనిపైగా ప్రముఖ సమావేశాలకు ఆహ్వానించడం లేదని ఈ నేతలు బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తంచేసినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం బీజేపీలోని పలువురు మాదిగ నేతలతో కూడిన ప్రతినిధి వర్గం పార్టీ జాతీయ పార్లమెంటరీబోర్డు సభ్యుడు, మాజీ సీఎం యడియూరప్పను కలిసింది. తమకు పార్టీలో జరుగుతున్న అన్యాయాన్ని ఆయన దృష్టికి తెచ్చింది. దీన్ని తాను సరిదిద్దుతానని ప్రతినిధి వర్గానికి ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది.

అధికార భాషా సమ్మేళనానికి తరలిరండి

అధికార ప్రతినిధి మీనాక్షి జొల్లె పిలుపు



ప్రాంతీయ అధికార సదస్సు వివరాలు వెల్లడిస్తున్న మీనాక్షి జొల్లె

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత పరిధితో పాటు నైరుతీ విభాగాల ప్రాంతీయ అధికార భాషా సమ్మేళనంలో భాగస్వాములు కావాలని కేంద్ర అధికార భాషా సంఘం జాయింట్ సెక్రటరీ మీనాక్షి జొల్లె పిలుపునిచ్చారు. గురువారం భాషాసంఘం ప్రతినిధులతో కలసి ప్రెస్‌క్లబ్‌లో మీడియా మాట్లాడుతూ శుక్రవారం సంజయ్‌నగర్‌లోని హెచ్‌ఎఎల్ పరిధి అకాడమి ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో సమ్మేళనం జరుగుతుందన్నారు. కెనరా బ్యాంకు సహకారంతో సదస్సు జరుగుతుందన్నారు. అధికారిక భాష హిందీ వాడకాన్ని ప్రోత్సహించేందుకు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా హోంమంత్రిత్వ శాఖ స్వతంత్ర విభాగంగా అధికార భాషా విభాగంను 1975 లో ఏర్పాటు చేశారు. అధికార పనిలో హిందీ ప్రగతిని ప్రోత్సహించే దిశగా భాషా విభాగం నిరంతరంగా పనిచేస్తోందన్నారు. ఏటా నాలుగు ప్రాంతీయ అధికార భాషా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ముంబై, జోధ్‌పూర్‌లో సదస్సులు జరిగాయని, ప్రస్తుతం బెంగళూరులో మూడో సదస్సు జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకతో పాటు తమిళనాడు, కే రళ, పుదుచ్చేరి, లక్షద్వీప్‌ల నుంచి ప్రతినిధులు భాగస్వాములు అవుతున్నారన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం దాకా సదస్సు కొనసాగుతుందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా అధ్యక్షతన జరిగే సదస్సులో వివిధ బ్యాంకులు, కేంద్రప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అధికార భాష కోసం ఉత్తమ సేవలు అందించిన 32 మందికి సత్కారం ఉంటుందన్నారు. కెనరా బ్యాంకుకు చెందిన వివిధ హోదాల అధికారుల, హెచ్‌ఎఎల్ ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు.

రామమందిరం ప్రారంభం
తర్వాతే సీట్ల పంపకాలు

- ఢిల్లీలో మాజీ సీఎం కుమారస్వామి

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరం ప్రారంభమైన తర్వాతే బీజేపీ-జేడీఎస్ మధ్య సీట్ల పంపిణీ వ్యవహారం ఒక కొలిక్కి రానుంది. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ అగ్రనేత హెచ్‌డీ కుమారస్వామి ఢిల్లీలో గురువారం మీడియాకు చెప్పారు. ఢిల్లీలో హోంశాఖ మంత్రి అమిత్‌షాతోనూ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోనూ బుధవారం భేటీ అయ్యానని, ఈ సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయని వెల్లడించారు. అయితే వాటి వివరాలను చెప్పేందుకు నిరాకరించారు. రాష్ట్రంలో గత ఆరునెలలుగా కరువు విలయతాండవం చేస్తున్నా సిద్ధరామయ్య ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పైగా కేంద్రంపైనే నిందలు వేస్తోందని కుమారస్వామి ఆరోపించారు. రాష్ట్రానికి సాధ్యమైనంత త్వరగా కరువు సాయం విడుదల చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశానని తెలిపారు. కరువు సాయం విషయంలో రాజకీయం వద్దని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. కేంద్రమంత్రిని కావాలన్న ఆశ తనకు లేదని, అసలు ఈ వదంతి ఎలా పుట్టిందో తనకు అర్థం కావడం లేదని కుమారస్వామి పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 28 నియోజకవర్గాల్లోనూ బీజేపీ, జేడీఎస్ అభ్యర్థుల విజయమే తన ముందున్న ఏకైక లక్ష్యమన్నారు.

'16వ ఆర్థిక కమిషన్ ముందున్న సవాళ్లు'పై
రేపు నగరంలో జాతీయ సదస్సు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 16వ ఆర్థిక కమిషన్ ముందున్న సవాళ్లు అనే అంశంపై రామయ్య అప్లయ్డ్ సైన్స్ యూనివర్సిటీకి చెందిన ది స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నగరంలో 20న జాతీయ సదస్సును ఏర్పాటు చేస్తోంది. ఈ సదస్సును ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభించనున్నారు. 16వ ఆర్థిక కమీషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కేల్కర్ అధ్యక్షోపన్యాసం చేస్తారు. కమీషన్ సభ్యుడు డా.ఎం.గోవిందరావు ప్రధాన ప్రసంగం చేయనున్నారు. ఈ మేరకు నగరంలో గురువారం విడుదలైన ప్రకటన పేర్కొంది. మొత్తం నాలుగు సెషన్లలో ఆర్థిక వేత్తల ప్రసంగాలు ఉంటాయని సదస్సు ముగింపు వేడుకలో రాష్ట్ర ఆర్థిక కమీషన్ చైర్మన్ అధ్యక్షులు సి.నారాయణ స్వామి కూడా ప్రసంగించనున్నారు.

నామఫలకాల నియమాల ఉల్లంఘన
21 వేల నోటీసులు జారీ

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలోని కంపెనీలు వాణిజ్య సంస్థలు, దుకాణాలు తమ బోర్డులను 60 శాతం కన్నడ భాషలోనే ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నియమాలను ఉల్లంఘించినందుకు ఇంతవరకు 21వేల నోటీసులను జారీ చేశామని బీబీఎంపీ చీఫ్ కమీషనర్ తుషార్ గిరినాథ్ నగరంలో గురువారం మీడియాకు చెప్పారు. ఫిబ్రవరి 28లోగా కన్నడ భాషలో నామఫలకాలను ఏర్పాటు చేయాలని వీరికి స్పష్టమైన సూచనలు చేశామన్నారు. గడువు తర్వాత కూడా నామఫలకాలు ఏర్పాటు చేయకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కన్నడ భాషలో నామఫలకాల ఆదేశాలు అమలయ్యేలా బీబీఎంపి చర్యలు తీసుకుంటోందని ఈ విషయంలో కన్నడ సంస్థలు సంయమనంతో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెనుకొండ టౌన్, జనవరి 18 : అనారోగ్యంతో బాధపడుతున్న ఎనిమిదేళ్ల కుమార్తె మందుల కోసం వెళ్తున్న ప్రసాద్ నాయక్ (30) అనే వ్యక్తి గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రసాద్‌నాయక్ సోమందేపల్లి మండలం చల్లాపల్లిలో నివాసముం టున్నాడు. మృతునికి భార్య శ్యామల, కుమార్తె అనుశ్రీ ఉన్నారు. సోమందేపల్లిలో మగ్గం పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమార్తెకు వారం నుంచి జ్వరం వస్తుండటంతో మందులు తీసుకురావడానికి ద్విచక్రవాహనంలో పెనుకొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆర్టీఓ చెక్‌పోస్టు సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద వెనుక వస్తున్న ఐషర్ వాహనం ముందు వెళ్తున్న ప్రసాద్ నాయక్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రసాద్ నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో భార్య, కుమార్తె రోదనలు మిన్నంటాయి.

దావణగెరెలో కొత్త అభ్యర్థి కోసం బీజేపీ అన్వేషణ

తీవ్రంగా ప్రయత్నిస్తున్న సీనియర్ నేతలు జీఎం సిద్దేశ్వర్, ఎంపీ రేణుకాచార్య



జీఎం సిద్దేశ్వర్, ఎంపీ రేణుకాచార్య

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దావణగెరె లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఈసారి కొత్త అభ్యర్థి బరిలోకి దిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించిన జీఎం సిద్దేశ్వర్ మరోసారి టికెట్ తనకే లభిస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. ఏడుపదుల వయసు దాటేయడంతో సిద్దేశ్వర్‌కు టికెట్ అనుమానమేనని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఒక వేళ తనకు టికెట్ ఇవ్వడం సాధ్యంకాకపోతే తన కుమారుడు అనిత్‌కుమార్‌కు గానీ, సోదరుడు జీఎం లింగరాజ్‌కు గానీ టికెట్ ఇవ్వాలని సిద్దేశ్వర్ పార్టీ అగ్రనేతలను కోరినట్లు సమాచారం. నియోజకవర్గం నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నాకే టికెట్‌ను ప్రకటించాలని మాజీ మంత్రి ఎంపీ రేణుకాచార్య ఇటీవల పార్టీ నేతలకు విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. తద్వారా తానూ బరిలో ఉన్నాననే సంకేతాన్ని ఆయన అధిష్ఠానం పెద్దలకు ఇచ్చినట్లు తెలిసింది. కొద్దికాలంగా రేణుకాచార్య దావణగెరెలో తరచూ కనిపిస్తున్నారు. కార్యకర్తలతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జగళూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే గురుసిద్ధనగౌడ కుమారుడు డాక్టర్ టీజీ రవికుమార్, దావణగెరె బీజేపీ నేత కేజీ కొట్రేష్ కూడా టికెట్‌కోసం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దావణగెరె లోక్‌సభ నియోజకవర్గం విషయంలో బీజేపీ అధిష్ఠానం పెద్దలు నోరు మెదపడం లేదు. అభ్యర్థి ఎంపిక విషయంలో మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప చక్రం తిప్పేట్లయితే ఎంపీ రేణుకాచార్యకు అవకాశం ఉంటుందని, ఒక వేళ అధిష్ఠానమే నేరుగా ఎంపిక చేస్తే చివరి అవకాశాన్ని జీఎం సిద్దేశ్వర్‌కు ఇవ్వొచ్చునని ప్రచారం జరుగుతోంది. ఈ రెండు పేర్లు కాకుండా సంఘ్‌పరివార్ నుంచి కొత్త నేత బరిలోకి దిగినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.

అయోధ్యకు వెళ్లేందుకు ప్రయత్నిస్తా : దేవెగౌడ



మీడియాతో మాట్లాడుతున్న దేవెగౌడ

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అయోధ్యకు వెళ్లాలని ఆసక్తిగా ఉందని, ప్రయత్నిస్తానని మాజీ ప్రధాని దేవెగౌడ తెలిపారు. తుమకూరు జిల్లా కుణిగల్ తా లూకా హంగరహళ్ళి విద్యా చౌడేశ్వరీ మఠంలో గురువారం దేవెగౌడ మీడియాతో మా ట్లాడుతూ ఆరోగ్యపరంగా వెళ్లే విషయమై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. రెండు మోకాళ్లు సక్రమంగా లేవన్నారు. అయినా సుదీర్ఘకాలం పాటు దండ నమస్కారాలు చేశానన్నా రు. ఇక్కడ మఠంలో జరిగిన హోమం పవిత్ర మైనదన్నారు. కుమారస్వామి తొలుత వచ్చి వెళ్లారన్నారు. కుమార సూచనల మేరకే ఇక్కడి పూజల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపనకు వెళ్లాలనేది అందరికీ ఇష్టమే అ న్నారు. తాను రాజకీయంగా మాట్లాడటం లేదన్నారు. ఆరోగ్యపరంగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఒకటి రెండురోజులలోనే నిర్ణయం తీసుకుంటానన్నారు.

ఉచితంగా శ్రీరాముడి టాటూలు



టాటూలు వేయించుకున్న భక్తులు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరంలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన వేళ దేశ వ్యాప్తంగా భక్తిపారవశ్యం విభిన్న రూపాలలో సాగుతోంది. బెళగావి దక్షిణ ఎమ్మెల్యే అభయ పాటిల్ నేతృత్వంలో ఉచితంగా టాటూల వేయించే కార్యక్రమం ఆరంభించారు. నగర వ్యాప్తంగా ఇందుకోసమే మూడు ప్రత్యేక కేంద్రాలను గురువారం లాంఛనంగా ఆరంభించారు. ఈనెల 22వ తేదీ వరకూ ఉచితంగా టాటూల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో కనీసం పదివేల మందికి వేయించదలచామన్నారు. బీపీ, మధుమేహంతో పాటు ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉండేవారు పాల్గొనరాదని కోరారు. భక్తులు తమ ఇష్టదైవంగా భావించే శ్రీరాముడి రూపాన్ని టాటూలు ఉచితంగా వేయిస్తామన్నారు. ప్రజల నుంచి స్పందన ఉంటుందా అని భావించామన్నారు. కానీ భక్తులు క్యూకట్టి మరీ టాటూలు వేయించుకుంటున్నారన్నారు. మహిళలు పెద్దఎత్తున వస్తున్నారన్నారు. రామభక్తుడు విఠల మాట్లాడుతూ శ్రీరాముడు ట్యాటూ అత్యంత ఇష్టంతో వేయించుంటున్నామన్నారు.

విద్యాసంస్థల్లో గుణాత్మకత కీలకం



పీఈఎస్‌లో హెచ్‌ఆర్ టెక్ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ జవహర్ తదితరులు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక విధానం అన్ని రంగాల్లో సాగుతున్న వేళ మానవవనరుల సమర్థతకు విద్యాసంస్థల్లో గుణాత్మకత కీలకమని పీఈఎస్ యూనివర్సిటీ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ పేర్కొన్నారు. పరిశ్రమ, అకాడమీల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించే దిశగా పీఈఎస్ యూనివర్సిటీలో హెచ్‌ఆర్ టెక్ సమ్మిట్ నిర్వహించారు. గురువారం ప్రారంభమైన సమ్మిట్‌లో ఇపాజా లాబ్స్ సీఈఓ అలోక్‌సిన్హా వివిధ కంపెనీల సీఈఓలు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ సాంకేతిక యుగంలో మానవవనరులు సమర్థవంతంగా నిర్వహించేందుకు పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య సహకార మార్పును పెంపొందించేదిశగా సమ్మిట్ నిర్వహించదలచామన్నారు. పీఈఎస్ ఇంజనీరింగ్ కళాశాల ఆరంభంలో కేవలం ఏడు కంపెనీలు మాత్రమే క్యాంపస్ ఇంటర్వ్యూలకు వచ్చేవని ప్రస్తుతం 500కు పైగా కంపెనీలు నిత్యం ఇంటర్వ్యూలు జరుపుతున్నాయన్నారు. అందుకు కారణం కళాశాలలో గుణాత్మక విద్యను పెంపొందించడమే అన్నారు. హెచ్‌ఆర్ నిపుణుల నుంచి ఎన్నో అనుభవాలు నేర్చుకున్నట్లు వివరించారు. అలోక్‌సిన్హా మాట్లాడుతూ పీఈఎస్ యూనివర్సిటీ విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. విద్యార్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. టెక్నాలజీ ప్రగతికి అనుగుణంగా మానవవనరుల కీలకమే అన్నారు. పరిశ్రమకు ఎలాంటి వారు అవసరమనేది తెలుసుకునే ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని విద్యార్థుల ట్రాక్ రికార్డును పరిగణలోకి తీసుకుంటారన్నారు. కొత్తతరం పంథాను మార్చేందుకు నిజమైన సామర్థ్యం కలిగిన వారిని ఎంపిక చేయడంలో హెచ్‌ఆర్ బాధ్యత ముఖ్యమన్నారు. సమ్మిట్‌లో హెచ్‌ఆర్ నిపుణులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, విద్యావేత్తలు, విధానాల రూపకర్తలు భాగస్వామ్యులయ్యారు. మేనేజ్‌మెంట్ డీనన్ డాక్టర్ శైలశ్రీహరిదాస్, వైస్‌ఛాన్సులర్ డాక్టర్ జె సూర్యప్రసాద్, సీఓఓ ప్రొఫెసర్ అజోయ్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ కెఎస్ శ్రీధర్‌లు పాల్గొన్నారు.

గ్యాంగ్ రేప్ ఘటనను సిట్‌కు అప్పగించాలి

- మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై - రేపు హావేరిలో భారీ నిరసన

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా హనగల్‌లో జరిగిన గ్యాంగ్‌రేప్ ఘటనను సిట్‌కు అప్పగించాలన్న డిమాండ్‌తో ఈ నెల 20న హావేరిలోని ఎస్పీ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నిరసన ప్రదర్శనలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. మోరల్ పోలీసింగ్‌తో పాటు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని బొమ్మై ఆరోపించారు. ఈ ఘటనలో సిట్‌ను నిరాకరించడం అంటే నిందితులకు లైసెన్సు ఇవ్వడమేనని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం సిద్ధరామయ్యకు మోదీ ఫోబియా పట్టుకుందని విమర్శించారు. ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని తెలిసిపోవడంతో ఆయన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కుట్ర చేస్తున్నారని బొమ్మై ఆరోపించారు. కేంద్రంలో మోదీ సుభిక్ష పాలన అందిస్తున్నారని, అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తున్నారని, ఇపుడు రామరాజ్యం కలను కూడా సాకారం చేయబోతున్నారని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల వరకే కాంగ్రెస్ ఆటలు సాగుతాయని, ఆపై అసలు ఆట ప్రారంభం కానుందని ఆయన వ్యాఖ్యానించారు.

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు రవి



ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), జనవరి 18 : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిరస్మరణీ యుడని బాలయ్య సైన్యం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బెంగళూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెంగళూరు బాలయ్య సైన్యం నేత దినకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొమ్మినేని రవి, మారుతీ నాయుడు, సత్యప్రసాద్, రమణారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

డేటింగ్ యాప్‌లో పరిచయం..
యువకుడికి మహిళ వేధింపులు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లో పరిచయమైన యువకుడిని మహిళ ఒకరు వేధిస్తున్న ఘటన వెలుగు చూసింది. బాలివుడ్ డైరెక్టర్ దీపికా నారాయణ భరద్వాజ్ తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ బెంగళూరు నగర పోలీస్ కమీషనర్ బి.దయానంద్ కు ట్యాగ్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ సూచన మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సదరు యువకుడు ఫిర్యాదు చేస్తే తప్పకుండా పరిశీలిస్తామని ప్రకటించారు. దీపికా ఎక్స్ ఖాతాలో ప్రస్తావించిన వివరాల ప్రకారం కొద్దిరోజుల క్రితం డేటింగ్ యాప్‌లో యువకుడికి ఓ మహిళ పరిచయం అయ్యింది. అనంతరం ఇరువురూ ఒకసారి కలిశారు. ఆపై సదరు మహిళ యువకుడిని డబ్బు కోసం పదే పదే బెదిరించడం ప్రారంభించింది. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో తెలియక యువకుడే డైరెక్టర్ దీపికాను ఆశ్రయించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

హత్యకేసులో 11 ఏళ్ల జైలు శిక్ష



వీరేష్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

చిత్తూరు లీగల్, జనవరి 18: హత్యకేసులో ఓ ముద్దాయికి న్యాయమూర్తి 11 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. చిత్తూరు నగరం వరిగపల్లి వద్ద ఉన్న జేఎంసీ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్‌కు చెందిన రాములు, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా జూకూరువాసి వీరేష్ పనిచేస్తున్నారు. 2023 మే 1 న మేడే సందర్భంగా కూలీలకు కాంట్రాక్టర్ సెలవు ఇచ్చారు. అదేరోజు రాత్రి కాంట్రాక్టరు కూలీలందరికీ భోజనం ఏర్పాటు చేశారు. ఆ భోజనం సక్రమంగా లేదని వీరేష్ చెప్పడంతో పక్కనే భోజనం చేస్తున్న రాములు అనే యువకుడు గొడవకు దిగారు. దీంతో కర్రతో రాములు తలపై వీరేష్ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రాములును స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాములు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు చిత్తూరు రెండో పట్టణ పోలీసులు వీరేష్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసు గురువారం ఫస్ట్ ఏడీజే కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి రమేష్. వీరేష్‌పై నేరం రుజువు కావడంతో 11 సంవత్సరాల జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ లోకనాథరెడ్డి వాదించారు.

వీరేంద్రహెగ్డేకు క్షీరాభిషేకం

రొళ్ల, జనవరి 18: మండల కేంద్రంలో గురువారం ధర్మస్థల మంజునాథస్వామికి, వీరేంద్ర హెగ్డేకు క్షీరాభిషేకం చేశారు. ఏపీలో వెనకబడిన ప్రాంతమైన మడకశిర నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అభ్యర్థన మేరకు ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ట్రస్టు దత్తత తీసుకునేందుకు ఆ ట్రస్టు చైర్మన్ వీరేంద్ర హెగ్డే ముందుకొచ్చిన విషయం విదితమే. దీంతో మం డల నాయకులు, ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, నా యకులు సిద్దగంగప్ప, ఈరన్న, రాజకుమార్, మా రన్న, నాగరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.